క్లుప్తంగా

నేషనల్ డిఫెన్స్ కాలేజీ బృందం సందర్శన



అవార్డు గ్యాలరీలో స్టీల్‌ప్లాంట్ అధికారులతో ఎన్‌డీసీ బృందం

ఉక్కునగరం: నేషనల్ డిఫెన్స్ కాలేజీ(ఎన్‌డీసీ) బృందం మంగళవారం స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించింది. పర్యటనలో భాగంగా బృందంలోని 17 మంది సభ్యులు ఉదయం ప్లాంట్‌కు చేరుకున్నారు. స్టీల్‌ప్లాంట్ ఈడీ(వర్క్స్) బిల్డింగ్‌లోని మోడల్ రూమ్‌ను సందర్శించారు. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి ప్రక్రియ, ముడి పదార్థాల సరఫరా, ఉత్పత్తుల రవాణా గురించి పీపీఏ విభాగం జీఎం డాక్టర్ రమాదేవి వారికి వివరించారు. అనంతరం అవార్డు గ్యాలరీని సందర్శించారు. స్టీల్‌ప్లాంట్ సాధించిన అవార్డులను పరిశీలించారు. తర్వాత టెక్నికల్ ట్రైనింగ్ సెంటర్ (టీటీసీ)కు వెళ్లి.. శిక్షణ కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు, వర్క్స్ అడ్మినిస్ట్రేషన్ అధికారి గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్‌ఎఫ్ విభాగాధిపతిగా దుర్గాప్రసాద్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ (ఈఎస్‌ఎఫ్) విభాగాధిపతిగా విభాగం జీఎం ఎం.వి.ఎస్. దుర్గాప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. 1999లో సింటర్ ప్లాంట్ విభాగం నుంచి డిప్యూటీ మేనేజర్‌గా బదిలీపై వచ్చిన దుర్గాప్రసాద్ అంచెలంచెలుగా జనరల్ మేనేజర్ స్థాయికి ఎదిగారు. ఇప్పటి వరకు హెచ్‌వోడీగా ఉన్న పి.ఎస్. ఘోష్‌ను మెకానికల్ (జీఎం)గా నియమించడంతో ఆ స్థానంలో దుర్గాప్రసాద్ నియమితులయ్యారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో విజేతలకు సత్కారం


క్రీడాకారిణిని సత్కరిస్తున్న దృశ్యం

గాజువాక : ఇటీవల కలకత్తాలో జరిగిన 42వ జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలలో విజయం సాధించిన క్రీడాకారులను స్థానిక నాయకులు మంగళవారం సత్కరించారు. కిక్‌బాక్సింగ్ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 87వ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు చేతులమీదుగా ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన 48 మంది క్రీడాకారులను సత్కరించి పతకాలు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడాకారులు భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. కరణంరెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి 65 మంది క్రీడాకారులు హాజరు కాగా, 48 మంది క్రీడాకారులు పతకాలను సాధించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాస్టర్ అథ్లెట్స్ సంఘం సభ్యుడు మంగా వరప్రసాద్, ప్రతినిధి డాక్టర్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

'పెండింగ్ జీతాలు చెల్లించాలి'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ నిర్వాసిత కాంట్రాక్టు కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలని ఉక్కు శ్రామిక సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన కార్యక్రమంలో సమస్యలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. వెంటనే సంబంధిత విభాగం యాజమాన్యం స్పందించి కార్మికులకు జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉక్కు నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరామ్మూర్తి, ఎస్.పెంటయ్య, కోనరాజు, కొండబాబు, ఎ.దేముడు, ఎం.రమణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పైడిమాంబ పండగ


అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు(ఇన్‌సెట్) పూజలందుకుంటున్న పైడిమాంబ అమ్మవారు


పరసలో స్టాల్స్ వద్ద సందడి


ఆకట్టుకున్న నేలవేషాలు

పెదగంట్యాడ: నడుపూరు గ్రామ దేవత పైడిమాంబ అమ్మవారి పండగను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని, గ్రామంలో వీధులనూ విద్యుత్ దీపాలతో అలంకరించారు. పైడిమాంబ ఉత్సవ కమిటీ చైర్మన్లు ములగపాక అచ్చింనాయుడు, బత్తిన నాగభూషణం ఆధ్వర్యంలో సోమవారం తొలేళ్ల ఉత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ రాయబారం, సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకాలు అలరించాయి. హాస్య వల్లరి, భజనలు, తప్పెటగుళ్లతో పాటు బుర్రకథ, రేలారే రేలా కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మంగళవారం ప్రధాన పండగను పురస్కరించుకుని పెద్దఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని, విశేష పూజలు చేశారు. అమ్మవారి ఘటాలను మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బాణసంచా పేలుళ్లతో ఊరేగించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, రాజాన రామారావు, అనకాపల్లి ఎస్పీ శ్రీనివాసరావు, జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు, గాంధీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కాతా బాలకృష్ణ తదితరులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో కార్మికులకు అన్యాయం


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: తెలుగు వారి ఆత్మ గౌరవానికి ప్రతీక అయిన విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రభుత్వరంగంలోనే కొనసాగాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 761వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన ఎఫ్ఎండీ, ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్, సీఎంఈ, ప్లాంట్ డిజైన్, వీఎస్‌జీహెచ్ తదితర విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఉద్యమంలో పాల్గొన్న కార్మికులను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఒక తాటిపైకి వచ్చి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తే విశాఖ ఉక్కుకు సానుకూల స్పందన లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ పాలనలో దేశ ప్రజలు దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల కంపెనీలు మూతపడ్డాయని, కార్మికులు పనిలేక రోడ్డున పడ్డారని అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణలో తగ్గేదే లేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు

విభిన్న ప్రతిభావంతులకు ముగిసిన శిక్షణ


సర్టిఫికెట్ అందజేస్తున్న జీఎం అశోక్

ఉక్కునగరం: విభిన్న ప్రతిభావంతులకు స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేసిన నైపుణ్య శిక్షణ ముగియడంతో, మంగళవారం వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. స్టీల్‌ప్లాంట్ కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ రెస్పాన్సిబిలిటీ (సీఈఆర్) కార్యక్రమంలో భాగంగా జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 100 మంది విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు. స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టైలరింగ్ తో పాటు అగరబత్తి, కొవ్వొత్తులు, ఫినాయిల్, సబ్బుల తయారీ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. టైలరింగ్ శిక్షణ మూడు నెలలు కాగా, మిగిలిన అంశాల్లో రెండు నెలలు శిక్షణ ఇచ్చారు. సుజాత నగర్‌లోని శ్రేయ ఫౌండేషన్, పెదవాల్తేరులోని సన్‌ఫ్లవర్ స్పెషల్ స్కూల్, ఎంవీపీ కాలనీలోని లెబెన్ హిల్ఫేల్లో ఈ శిక్షణ ఇచ్చారు. స్టీల్‌ప్లాంట్‌లోని టెక్నికల్ ట్రైనింగ్ సెంటర్‌లో మంగళవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో సీఎస్సార్ విభాగం జీఎం ఎ.అశోక్ ముఖ్య అతిథిగా హాజరై, శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సీఎస్సార్ అధికారులు పలువురు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్
అధ్వానంగా రహదారి

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు పరిధి వుడా నగర్ ఫేజ్–1 కుసుమనగర్ ఏవీఎన్ స్కూల్ పక్కన రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ముఖ్యంగా వుడా ఫేజ్–1 పార్కు చుట్టుపక్కల రోడ్లను వేయకుండా వదిలేయడంతో ఈ దారిలో ప్రయాణించడానికి ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి రోడ్లు పూర్తిస్థాయిలో నిర్మించాలి.

– వానపల్లి రమేష్, వుడా ఫేజ్–1, కూర్మన్నపాలెం


ఉడా ఫేజ్–1లో గతుకుల రోడ్డు

ఇష్టానుసారంగా స్పీడ్ బ్రేకర్లు

- అధికారుల తీరుపై విమర్శలు


శ్రీనగర్‌లో ఒక రోడ్డుపై వేసిన ఎత్తయిన స్పీడ్ బ్రేకర్


లక్ష్మీపురం రోడ్‌లో ఎత్తయిన స్పీడ్ బ్రేకర్

గాజువాక : రహదారి నిర్మాణ పనుల్లో అధికారుల నిర్లక్ష్యం ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తోంది. అవసరం ఉన్నా, లేకపోయినా రోడ్లపై ఇష్టం వచ్చినట్లు స్పీడ్ బ్రేకర్లను నిర్మిస్తున్నారని, దీంతో తమ ప్రాణాలమీదికొస్తోందని వాహనచోదకులు వాపోతున్నారు.

ఇటీవల గాజువాక జోన్‌లో రోడ్ల అభివృద్ధి, పునర్నిర్మాణ పనులను చేపట్టిన విషయం తెలిసిందే. అభివృద్ధిపరంగా అంతా బాగున్నా, అధికారుల తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు సైతం ఎక్కి దిగలేనంత ఎత్తులో స్పీడ్ బ్రేకర్లను నిర్మిస్తుండటంతో ప్రజల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ఇదీ పరిస్థితి..

- 71వ వార్డు శ్రీనగర్‌లోని ఒక ప్రైవేట్ స్కూల్ సమీపంలోని వీధిలో వారం రోజుల క్రితం నిర్మించిన సిమెంట్ రోడ్డుపై కేవలం వంద మీటర్ల దూరంలో ఎత్తయిన రెండు స్పీడ్ బ్రేకర్లను నిర్మించారు. దీంతో వాటిపై వాహనాలు సక్రమంగా వెళ్లలేని పరిస్థితి చోటుచేసుకుంటోంది.
- 87వ వార్డులో ఏడుగుళ్ల జంక్షన్ నుంచి సంతకు వెళ్లే మార్గంలో, ఇటు వడ్లపూడి ప్రధాన రహదారికి వెళ్లే మార్గంలో వేసిన స్పీడ్ బ్రేకర్లతో జనం అవస్థలు పడుతున్నారు. సంతమార్గంలో సుమారు 150 మీటర్ల దూరంలో ఎత్తయిన నాలుగు స్పీడ్ బ్రేకర్లను నిర్మించారు. ఒక పద్ధతం టూ లేకుండా నిర్మించిన స్పీడ్ బ్రేకర్లపై వెళ్తున్న వారిలో పలువురు అదుపుతప్పి పడిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు.

అభివృద్ధి పనుల్లో ఇలా..

ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకు ప్రభుత్వం కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతుంటే, అధికారుల తీరు మాత్రం ఇందుకు భిన్నంగా ఉందని చెబుతున్నారు. వడ్లపూడిలోని సీడబ్ల్యూసీ వద్ద రోడ్డుపై కల్వర్టును నిర్మించేందుకు అధికారులు రోడ్డు మొత్తం తవ్వించేశారు. వస్‌వే సౌకర్యం గల ఈ రోడ్డును తవ్వుతున్నప్పుడే స్థానికులు అభ్యంతరం తెలిపినా, అధికారులు పట్టించుకోకుండా తమ పని తాము చేసుకుని వెళ్లిపోయారు. ఈ రోడ్డులో సుమారు నెలరోజులకు పైగా రాకపోకలు సాగించడం కష్టమని తెలియడంతో, అధికారులపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఒకపక్క రోడ్డులో గొయ్యిని మూసివేసి రాకపోకలకు అనుమతించారు. స్పీడ్ బ్రేకర్ల నిర్మాణం విషయంలోనూ అధికారులు నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని జనం విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రమాదాల నివారణకే..

ప్రమాదాల నివారణకు రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు వేయాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. జనం రాకపోకలు ఎక్కువగా ఉన్న రోడ్లలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, అందువల్ల స్పీడ్ బ్రేకర్లు వేయాలని వారు కోరారు. అందువల్లే వేస్తున్నాం.

– ప్రసాద్‌బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (వర్క్స్), జీవీఎంసీ, గాజువాక జోన్

గెడ్డలోకి దూసుకెళ్లిన కారు

పెదగంట్యాడ పీహెచ్‌సీ వైద్యాధికారికి గాయాలు


గెడ్డలోకి దూసుకెళ్లిన కారు, పక్కన డాక్టర్ రమేష్‌బాబు

పెదగంట్యాడ: వినాయనగర్ వుడా కాలనీ కమ్యూనిటీ హాల్ సమీపంలో మంగళవారం ఓ కారు అదుపుతప్పి గెడ్డలోకి దూసుకెళ్లింది. దీంతో కారులో ఉన్న పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబుకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షు లు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయకనగర్ వుడా కాలనీలో గల సీడబ్ల్యూసీలో మంగళవారం నిర్వహించనున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వైద్యాధికారి రమేష్‌బాబు వచ్చారు. ఆ కార్యక్రమాన్ని ముగించుకుని తిరిగి వెళ్లేందుకు ఆయన గెడ్డ పక్కన పార్క్ చేసిన కారును తీస్తుండగా ఒక్కసారిగా కారు ముందుకు వెళ్లిపోయింది. దానిని కంట్రోల్ చేసేలోగా గెడ్డలోకి దూసుకెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆయన స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే అతన్ని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. గెడ్డలో ఉన్న కారును జీవీఎంసీ అధికారులు జేసీబీ సాయంతో బయటకు తీశారు. ఈ ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని న్యూపోర్టు సీఐ రాము తెలిపారు.

కల్యాణం .. కమనీయం


కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులను అధిష్టంపజేసి ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలు అందజేశారు.

హాట్ కేకుల్లా క్రికెట్ టికెట్లు


టికెట్ల కోసం బారులు తీరిన క్రికెట్ అభిమానులు


పరిస్థితిని పర్యవేక్షిస్తున్న ఏసీపీ నర్సింహమూర్తి

- పోటెత్తిన అభిమానులు
- గంటల వ్యవధిలోనే అయిపోయిన టికెట్లు

పెదగంట్యాడ: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి–ఏసీఏ–వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 19న నిర్వహించనున్న భారత్–ఆస్ట్రేలియా వన్డే క్రికెట్ మ్యాచ్ టికెట్స్ హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. మండలంలోని వికాస్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో మంగళవారం ఉదయం విక్రయించిన టికెట్ల కోసం క్రికెట్ అభిమానులు పోటెత్తారు. కౌంటర్ ప్రారంభించిన గంటల్లోనే టికెట్లన్నీ హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. రూ.600, రూ.1500 టికెట్లు గంటల వ్యవధిలోనే అయిపోగా, రూ.2వేలు, రూ.3వేలు, రూ.3,500, రూ.6వేల టికెట్ల విక్రయాలు మందకొడిగా సాగాయి. అభిమానుల రద్దీని దృష్టిలో ఉంచుకుని న్యూపోర్టు సీఐ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. వెస్ట్ ఏసీపీ ఎ.నర్సింహమూర్తి పరిస్థితిని పర్యవేక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు గానీ, తోపులాటలు లేకుండా సాఫీగా టికెట్లను విక్రయించారు. అయితే రూ.600, 1500 టికెట్లు ముందుగానే అయిపోవడంతో అభిమానులు కాస్త నిరాశకు లోనయ్యారు.

1 నుంచి విద్యార్థులకు రాగిజావ


విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న బృంద సభ్యులు

పెదగంట్యాడ: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ఏప్రిల్ ఒకటి నుంచి విద్యార్థులకు రాగిజావను అందజేయాలని ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ జిల్లా సమన్వయకర్త జయశాస్త్రి ఆదేశించారు. మండలంలోని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నెల్లిముక్కు ఎంపీపీ పాఠశాల, సిద్దేశ్వరంలోని ఎంపీపీ పాఠశాలలను యూనిట్ బృందం మంగళవారం సందర్శించింది. ఆయా పాఠశాలల్లో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని బృంద సభ్యులు పరిశీలించారు. విద్యార్థులకు భోజనాలు వడ్డించారు. నాణ్యతపై ఆరా తీశారు. రికార్డులను తనిఖీ చేశారు. పాఠశాలలకు అందజేస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పోషక విలువలున్న ఆహారాన్ని విద్యార్థులకు అందజేస్తున్నామని చెప్పారు. పాఠశాలలకు వచ్చే విద్యార్థుల్లో 90 శాతం మంది మధ్యాహ్న భోజనం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సహాయ సమన్వయకర్త సత్యనారాయణ, సీఆర్పీ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే ప్రథమ ర్యాంక్


మాట్లాడుతున్న జెడ్సీ సింహాచలం

అగనంపూడి: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖకు ప్రథమ ర్యాంక్ వచ్చేందుకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు సహకారం అందించాలని జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం కోరారు. 79వ వార్డు అగనంపూడి ఆస్పత్రి రహదారిలోని అభిరామ్ ఎన్‌క్లేవ్‌లో ఏర్పాటు చేసిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ర్యాంక్‌ల జాబితాలో 24వ ర్యాంక్ నుంచి 4వ ర్యాంక్‌కు వచ్చేందుకు ప్రజలు అందించిన సహకారం ఎనలేనిదన్నారు. నగర ప్రజల సహకారంతో బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జనను 90శాతం వరకు అరికట్టడం జరిగిందన్నారు. ప్లాస్టిక్ వస్తువులు, కవర్ల వినియోగం నియంత్రించడంలో జీవీఎంసీ పత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్, కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, నాయకులు సత్యనారాయణ, సూర్యనారాయణ, సింహాచలం, అపార్ట్‌మెంట్ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఈ-వాహనాలతో పర్యావరణ పరిరక్షణ


ఐఐపీఈ డైరెక్టర్ సెంథిల్ కుమార్‌ను సత్కరిస్తున్న విజ్ఞాన్ యాజమాన్యం

అగనంపూడి: పర్యావరణ పరిరక్షణ, పెట్రోలియం ఉత్పత్తుల ఆదా కోసం భవిష్యత్తులో ఎలక్ట్రికల్ వాహనాలనే వాడాల్సి వస్తుందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) శాలివాహన్ డైరెక్టర్ సెంథిల్ కుమార్ అన్నారు. ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం, పోకడలు, అవకాశాలపై దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించనున్న సదస్సు మంగళవారం ప్రారంభమైంది. ఆయన మాట్లాడుతూ కాలుష్యరహిత సమాజం, వాతావరణంలో సమతుల్యత సాధించడం కోసం భవిష్యత్తులో అందరూ ఎలక్ట్రికల్ వాహనాలను వినియోగించడం మంచిదన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పాండిచ్చేరి ప్రొఫెసర్ ఇమామ్ పాణిగ్రాహి మాట్లాడుతూ వాతావరణలో కాలుష్యం వల్ల భూతాపం పెరిగిపోతోందన్నారు. వాటి నుంచి మనల్ని మనం కాపాడుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాల్లో ఎలక్ట్రికల్ వాహనాలు ఒకటని పేర్కొన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ బి.అరుంధతి, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు, కార్యక్రమ సమన్వయకర్తలు సుశాంత్ కుమార్ సాహు, హెచ్.వి.రమణ, వివిధ విభాగాల డీన్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న పాఠశాల హెచ్ఎం అప్పలరాజు


విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలను మింగిస్తున్న డాక్టర్ రామకృష్ణ

పెదగంట్యాడ: నులిపురుగుల నివారణకు విద్యార్థులు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని దేవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం మాత్రలు వేశారు. కార్యక్రమంలో హెచ్ఎం అప్పలరాజు, కృపాళిని, ఈశ్వరరావు, ఆశ వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాజువాక పీహెచ్‌సీ పరిధిలో..

గాజువాక : నులిపురుగుల నియంత్రణ దినం సందర్భంగా స్థానిక సుందరయ్య కాలనీలోని రవీంద్ర ఇండియన్ స్కూల్ విద్యార్థులకు గాజువాక పీహెచ్‌సీ అధికారులు ఆల్బెండ్‌జోల్ మాత్రలను పంపిణీ చేశారు. పాఠశాలలోని 250 మంది విద్యార్థులకు జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ జీవన్‌రాణి, గాజువాక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వై.రామకృష్ణ తదితరులు ఈ మాత్రలను స్వయంగా మింగించారు. డాక్టర్ జీవన్‌రాణి మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డీవర్మింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ సరైన ఆరోగ్య అలవాట్లను కలిగి ఉండటంద్వారా నులిపురుగులను నిరోధించవచ్చన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పి.నాగ అప్పారావు, పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.వి.కె.పరశురామ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.